# "జీపీ కార్మికులు - వెట్టిచాకిరి"

- డాక్టర్ ఎస్. తిరుపతయ్య.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలలో పని చేస్తున్న 40 వేలకు పైగా గల కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వ వ్యవస్థలోనే ఉన్న మమ్మల్ని ఎప్పటికైనా ఏ ప్రభుత్వమైనా రెగ్యులరైజ్ చేసి మా జీవితాల్లో వెలుగు నింపక పోతుందా అని ఎదిరి చూస్తూ ఇన్నేళ్ళుగా వెట్టి చాకిరి చేస్తున్నామని వారు తమ గోడు వెళ్లగక్కుతున్నారు. చాలా సహజమైన ఆశతో ప్రారంభమైన వారు దశాబ్దాల తరబడి గొడ్డు చాకిరీ చేసీ చేసి వృధ్యాప్యానికి చేరువయ్యారు గానీ వారి ఉద్యోగ జీవితాల్లో ఎటువంటి అద్భుతమూ జరగలేదు, ఏ వెలుగూ నిండలేదు.

త్రవి పాతవి కలిపి రాష్ట్రంలో 12,751 గ్రామ పంచాయితీ లుండగా ప్రతి గ్రామంలో ఆఫీసు శుభ్రత, పారిశుధ్య సేవలు, నీటి సరఫరా,విద్యుత్తు నిర్వహణ మరియు గ్రామ సర్పంచు, సెక్రటరీ లకు అసిస్టెంట్ గా కారోబార్ లు ఉంటారు. వీరందరూ ఉంటేనే గ్రామంలో పై సేవలు నిరాటంకంగా అందుతాయి. ఇలా ప్రభుత్వ పాలనలో ఆవశ్యమైన పాత్రతో గ్రామంలో ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలుకు ఆచరణ రూపాన్నిచ్చేది ఈ జీపీ కార్మికులే. జీపీ కార్మికుల్ని ప్రభుత్వం స్వయంగా ఒప్పంద ఉద్యోగులుగా నియమించుకున్నప్పటికీ ప్రభుత్వంలో ఉన్నతస్థాయి వ్యక్తులు సైతం వీరెవరో, ఏంచేస్తారో తెలీసే తెలియదన్నట్టు,తమకే భాద్యతా లేనట్టు ప్రవర్తించటం చాలా అన్యాయం. జీపీ కార్మికులది గ్రామ నాగరికతలో విడదీయలేని పాత్ర. చరిత్ర పొడుగునా ఇటువంటి వారిని భూస్వామ్య,రాచరికపు వ్యవస్థ వాడుకుంది. ఆధునిక వ్యవస్థలోనూ పాలకులు, పౌరసమాజంలోనూ ఇంకా అదే ధోరణి కొనసాగుతోంది. జీపీ కార్మికుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. సఫాయ్ కార్మికులు ప్రతి రోజు ఉదయమే ఆఫీస్ శుభ్రపర్చి గ్రామంలో డ్రైనేజీ ఉన్నచోట్ల అవీ శుభ్రం చేసి ఊళ్ళో కుక్కో పిల్లో చస్తే ఆ కళేబరాల్ని చేతులతో ఊరవతలకి లాక్కెళ్లి వాటిని ఖననమో,దహనమో చేయాలి. ఊళ్ళో జరిగే ప్రతి పంచాయితీకి,ప్రభుత్వ కార్యక్రమాలకి, అధికారుల సందర్శనకీ వీరుండాలి. ఇవికాక ప్రభువులవారి వ్యక్తిగత పనులూ ఉండవచ్చు.

పంప్ ఆపరేటర్స్ కూ చేతినిండా పనే ఉంటుంది. ఇక కారొబారుది పేరుకు సారు హోదా, చేతినిండా ఫైళ్లు, తినటానికి టైం లేనంత పని. ఆయనపై అందరికీ అనుమానమే, ఆయన అందరికీ లోకువే. ఒక్క ఎలక్ట్రీషియన్ కి పనిగంటల్లో కొంత వెసులుబాటు ఉంది గానీ మిగతా అందరూ దాదాపు పూర్తికాలపు శ్రామికులు. ఆదివారం, పండుగ సెలవులు అంటూ లేని, కనీసం ఉపాధి హామీ పనికి వెల్దామన్నా అవకాశం ఉండని బిజీ ఉద్యోగులీ జీపీ కార్మికులు. ఆరోగ్యానికి,పిల్లల చదువులకు,పెళ్లిళ్లకు లక్షల రూపాయలు ఖర్చవుతున్న ఆధునిక కాలంలో నేడు కారోబార్ ల జీతం నెలకు 2 నుండి 3 వేలు. పుంపు ఆపరేటర్లు,ఎలక్ట్రీషియన్ల జీతం నెలకు 1500 నుండి రెండు వేలు. స్వీపర్లు, పారిశ్శుద్ధ కార్మికుల జీతం గరిష్టంగా నెలకు 1500. ఆ పాటి "జీతాన్ని" నెలలు, సంవత్సరాల పాటు బకాయిలు పెట్టిగానీ ఇవ్వరు. వారు చేసే శ్రమకీ పొందే జీతానికి ఏమాత్రం పొంతన లేదు. సాదారణ న్యాయ దృష్టి తో చూసినా చట్ట పరంగా చూసినా జీపీ కార్మికులు వారు చేస్తున్న శ్రమకు తగని అత్యల్ప జీతం తీసుకుంటున్నారు. ఈ సత్యం కార్మిక శాఖకు తెలుసు, అధికారులకు, మంత్రులు, ముఖ్యమంత్రులందరికీ తెలుసు. కాకపోతే ఈ స్వీపర్లు, సపాయి కార్మికులు పేద గ్రామీణ నిరుద్యోగులు కూడా తమ లాంటి మనుషులేనని, వారికి కూడా హక్కులుంటాయనేది వారిని వాడుకునే వారి ఊహకందటం లేదు.

రాజ్యాంగం, చట్టాలు "జీవన వేతనం" లేదా "కనీస వేతనం" అనేది కేవలం పనిచేసే మనిషి బ్రతికి ఉండటానికి సరిపడా ఆహార సముపార్జనకు మాత్రమే కాక అతని కుటుంబం మొత్తానికి సరిపడా ఆహారం, కుటుంబ సభ్యులందరికీ మంచి ఆరోగ్యం, విద్య, సౌఖ్యం,హుందాతో కూడిన జీవితం గడపటానికి ఇంకా అత్యవసర ఖర్చులు,వేడుకలు, వినోద అవసరాలకు కూడా సరిపోయే విధంగా ఉండాలని నిర్వచించాయి. ఈ కనీస వేతనం జాతీయ స్థాయిలో ఒకే విధంగా ఉండక వివిధ రాష్ట్రాల్లోని జీవన వ్యయాన్ని అనుసరించి వివిధ స్థాయిల్లో ఉంటుంది. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తీరుగా ఉన్నప్పటికీ ఆయా రాష్ట్రాల్లో పై అవసరాలు తీర్చే స్థాయిలో వేతనాలు ఉండాలనేది రాష్ట్ర ప్రభుత్వాలకు చట్టం నిర్దేశించే లక్ష్యం. ఈ లక్ష్యానికి జీపీ కార్మికుల వేతనాలకు ఎంత వ్యత్యాసం ఉందో ప్రభుత్వాలకు ఎప్పటికి అర్ధమవుతుంది! ఎప్పటికైనా పర్మనెంట్ లాంటిదేమైనా కాకపోతుందా అనే ఆశతో ఈ కార్మికులు జీతం చూసుకోకుండా పనిచేస్తూ వెళ్ళటం అదే భ్రమలో వారిని ఉంచుతూ సర్పంచులు,అధికారులు,ప్రభుత్వం వారితో అడ్డగోలు చాకిరీ చేయించుకోవటం తప్ప ఇక్కడొక న్యాయం లేదు,చట్టం అంతకన్నా లేదు.

భారత రాజ్యాంగం లోని ప్రాథమిక హక్కుల్లో మూడవది "దోపిడి నుండి రక్షణ పొందే హక్కు" (Right against exploitation). ఈ హక్కును వివరిస్తూ 23 వ ఆర్టికల్ ఇలా అంటుంది "మనుష్యుల క్రయవిక్రయాలు,బలవంతపు చాకిరీలు,ప్రతిఫలం ఏదీ చెల్లించకుండానే పనిచేయించుకోవటం(begar) నిషేధించబడినవి. పై నిబంధన ఉల్లంఘన శాసనరీత్యా శిక్షింపదగిన అపరాధమగును". ఇక్కడ బలవంతపు చాకిరీలో 'బలము' అనగా ఆకలి,పేదరికమును ఉపయోగించుకొని దోపిడీ చేయు బలం అని అర్ధం. ఈ హక్కు వెలుగులోనే 1976 లో భారత ప్రభుత్వం పేదలతో ఎవరూ వెట్టి చేయించుకోకూడదంటూ వెట్టిచాకిరీ నిర్మూలన చట్టం తెచ్చింది గానీ దిగువ ప్రభుత్వాలు ( ఆర్టికల్12 ప్రకారం గ్రామ పంచాయతీలు కూడా ప్రభుత్వమే) స్వయంగా వెట్టి చేయించుకుంటున్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సహా అంతా చూస్తూ కూడా చూడనట్లు నటిస్తున్నారు. అది వెట్టి కాదన్నట్టు, అదొక ఉద్యోగమే అన్నట్లు మాట్లాడుతున్నారు. అవి ఉద్యోగాలే అయితే దినసరి కూలీలకు, ఉపాధి హామీ కూలీలకు సైతం చట్టప్రకారం చెల్లించే వేతనాలకు జీపీ కార్మికులు ఎందుకు అర్హులు కాకుండా పోయారు?

భారత ప్రభుత్వ కనీస వేతనాల చట్టం-1948 వీరికి తప్పనిసరిగా వర్తించాల్సిన చట్టం. కనీస వేతనాల చట్టం సెక్షన్ 3 సబ్ సెక్షన్ 3b ప్రకారం నెలవారీ ఉద్యోగులకే కాదు,రోజువారీ, ఒక గంట సహా రోజులో పరిమిత సమయం మరియు పీసు వర్క్ శ్రామికులకు సైతం ఈ చట్టం వర్తిస్తుంది. నిర్దిష్టంగా, స్థానిక అధికార సంస్థలు నియమించే జీపీ కార్మికులూ ఈ చట్టానికి పూర్తి అర్హులే.

ఈ సందర్భంగా కొన్ని కోర్టు తీర్పులనూ ప్రస్తావించాలి. 1983 లో సంజిత్ రాయ్ కి రాజస్థాన్ ప్రభుత్వానికి మధ్య నడిచిన కేసులో సుప్రీంకోర్టు కరువు నివారణ కార్యక్రమం క్రింద రాజస్థాన్ ప్రభుత్వం నియమించిన తాత్కాలిక ఉద్యోగులు కూడా 23 వ ఆర్టికల్ క్రింద కనీస వేతనాలను పొందటానికి హక్కు కలిగి ఉన్నారని పేర్కొంది. అలాగే అదే సంవత్సరంలో సుప్రీంకోర్టు మరో కేసులో, తగినంత చెల్లింపులు లేకుండా ఖైదీలచే పనిచేయించటం కూడా బలవంతపు చాకిరీ కిందకు వస్తుందని,అది 23 వ ఆర్టికల్ ఉల్లంఘనే అవుతుందని పేర్కొంది. ఈ మధ్య కూడా జాతీయ ఉపాధి హామీ పథకం లో పనిచేసే కూలీలకు నిర్ణయించే వేతనం సైతం కనీస వేతన చట్ట పరిధిలోనే ఉండాలని అనేక సార్లు కోర్టులు ప్రభుత్వాలకు సూచించాయి. జీపీ కార్మికులతో వెట్టి చేయించుకోవటం అనేది సరైన జీతం ఇవ్వకుండా వారి శ్రమను దోచుకోవటం మాత్రమే కాదు వారికి గల గౌరవంగా జీవించే హక్కును నిరాకరించి అవమాన పర్చటం. ఇది అనాగరికం, అమానవీయం.

కొన్ని రాష్ట్రాల్లో జీపీ కార్మికుల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా పర్మనెంట్ చేసి జీతాలు పెంచారు. ఈ సమ్మె ద్వారా మన రాష్ట్రంలోనూ తాము చేస్తున్న ఉద్యోగాల్ని పర్మనెంట్ చేయాలని,అప్పటిదాకా చట్టం ప్రకారం తమ శ్రమకు తగిన జీతాలు,సదుపాయాలు కల్పించాలని వారు కోరుతున్నారు. ఇవే డిమాండ్లతో 2014 లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ కొత్తలో 45 రోజులు సమ్మె చేశారు. ప్రభుత్వం వైపు నుండి దాటవేత తప్ప అడుగు ముందుకు పడిందిలేదు. ఈ కార్మికుల డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవి. సమాజమంతా మద్దతిచ్చి తోడుగా నిలబడాలి. ఒక సందర్భంలో సుప్రీం కోర్టు చెప్పినట్లుగా కొద్ది కాలం మాత్రమే ఉండే పనులకు తప్ప శాశ్వతంగా ఉండే పనులకు ఉద్యోగుల్ని శాశ్వతప్రాతిపదికనే తీసుకోవాలి. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్పందించి వారిని పర్మనెంట్ చేయాలి. అప్పటివరకు వారు ఉద్యోగం లో చేరిన నాటి నుండి కనీస వేతన చట్టం ప్రకారం వేతనం నిర్ణయించి బకాయిలతో సహా చెల్లించాలి.